సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 21-12-2024

సంపుటి: 20 సంచిక: 228

పేజీలు: 4 వెల: రూ.1

## హత్యకుట్ర కేసులో ఏడుగురు అరెస్టు

- రెండు పిస్టల్స్, ఒక తపంచా, 45 బుల్లెట్స్ స్వాధీనం
- మరికొందరి పాత్రపై విచారణ
- మీడియా సమావేశంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి

(సత్యంన్యూస్, పలాస)

టీడీపీ పలాస పట్టణ అధ్యక్షులు బడ్డ నాగరాజు హత్యకు కుట్ర చేసిన కేసులో ఏడుగుర్ని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ప్రకటించారు. శనివారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కుట్రకు పాల్పడిన - మిగతా 4లో






# రీ-సర్వేలో లోపాలు..

# వేలమంది విన్నపాలు

## కర్లెంలో కొనసాగుతున్న పోరాటం


- అధికారుల చేతివాటంతో మారిపోయిన రికార్డులు
- లోపెంట సర్వేయర్ సరెండర్





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైకాపా హయాంలో చేపట్టిన భూముల రీసర్వే లోపభూయిష్టంగా జరిగిందనడానికి రెవెన్యూ సదస్సులకు వస్తున్న ఫిర్యాదులే నిదర్శనం. అప్పుడే ఫిర్యాదులు వచ్చినా రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు పెద్దగా స్పందించిన దాఖలాలు లేవు. సర్వేలో లోపాలను సరిచేస్తామని ప్రకటించినా వాటిని పట్టించుకోలేదు. సర్వే సిబ్బందిపై పని ఒత్తిడి, సాంకేతిక కారణాల వల్ల అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించారు. సర్వే చేపట్టిన రెవెన్యూ గ్రామాల్లో భూకొలతల్లో తేడాలు, సర్వే నెంబర్ల మార్పు, వారసుల పేర్ల నమోదు, సరిహద్దు సమస్యలు, భూ విస్తీర్ణంలో తేడాలు, రికార్డుల్లో తప్పులు, అడంగల్‌లో పేర్లు మార్పు, వారసత్వానికి బదులు కొనుగోలుగా నమోదు.. తదితర సమస్యలతో ఇప్పటికీ రైతులు గ్రామస్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటికి గ్రామస్థాయిలో సచివాలయ సర్వేయర్లు, మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది చేతివాటమేనని ఆరోపణలు ఉన్నాయి. వివాదాస్పద, డీ-పట్టా భూములను జిరాయితీగా చూపించారని విమర్శలు ఉన్నాయి. వైకాపా నాయకుల అండతో రెవెన్యూ అధికారులు, సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్టు జిల్లావ్యాప్తంగా వెలుగులోకి వస్తున్నాయి. రీ-సర్వేలో వాస్తవానికి విరుద్ధంగా భూములతో సంబంధం లేని వ్యక్తుల పేర్లను చొప్పించి రెవెన్యూ అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడినట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. కొత్తూరు మండలం కర్లెమ్మ రెవెన్యూ పరిధిలో వందలాది ఎకరాల పంట భూములకు సంబంధించిన రికార్డులను రెవెన్యూ అధికారులు, సిబ్బంది తారుమారు చేశారు. రీ-సర్వేలో వేరొకరి పేరును చేర్చి రికార్డులను మార్చేశారు. దీనిపై రెండు నెలలుగా రైతులు ఆందోళన చేస్తున్నా అధికారులు స్పందించడం లేదు. ఇదే మాదిరిగా సోంపేట మండలం కొర్లాం రెవెన్యూ పరిధిలో అగ్రహారం చెరువు ఆయకట్టు కింద ఉన్న కొర్లాం, పాలవలస పంచాయతీలోని కుమ్మరిపాడు, లక్కవరానికి చెందిన సుమారు 160 మంది రైతులకు చెందిన 210 ఎకరాల జిరాయితీ భూమిని రీ-సర్వేలో ఒడిశాకు చెందిన వ్యక్తి పేరుతో నమోదుచేసి ఎల్‌సీఎంను జనరేట్ చేశారు. ప్రస్తుతం ఈ అంశం జేసీ విచారణ చేస్తున్నారు. సుమారు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉంది. ప్రస్తుతం ఇలాంటి అక్రమాలు వేలల్లో ఉన్నాయి.



దరఖాస్తు

స్థలం : కేశవరాయునిపాలెం

తేది : 29-01-2024

మహారాజశ్రీ గౌరవనీయులైన శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ వారి దివ్యసముఖమునకు శ్రీకాకుళం జిల్లా, లావేరు మండలం కేశవరాయునిపాలెం గ్రామస్థులు నమస్కరించి వ్రాసుకున్న దరఖాస్తు విన్నపములు.

ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలో లావేరు మండలం లోపెంట రెవెన్యూ గ్రామంలో జరిగిన రీ-సర్వేలో గ్రామ సర్వేయర్లు చేతివాటం చూపించినట్టు బాధితులు 2023 జూన్ 5న గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. లావేరు మండలంలో 18 గ్రామంలో రీ-సర్వే నిర్వహించగా అందులో లోపెంట రెవెన్యూ నుంచే ఎక్కువ ఫిర్యాదులు గ్రావెన్స్‌లో కలెక్టర్‌కు అందాయి. డీ-పట్టా భూములను జిరాయితీ భూములుగా మార్చడానికి రైతుల నుంచి పెద్ద మొత్తంలో గ్రామ సర్వేయర్ కొన్ని సుధీర్ వసూళ్లకు పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 29న కేశవరాయపాలెం నుంచి మరోసారి కొన్ని సుధీర్‌పై గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఆర్డీవోకు విచారణ చేయాలని ఆదేశించారు. దీన్ని సర్వేశాఖ ఏడీకి అప్పగించి పూర్తి నివేదిక ఇవ్వాలని సూచించారు. సర్వే శాఖ ఏడీ మండల సర్వేయర్‌కు బాధ్యత అప్పగించి ఫిర్యాదు దారుడు పేర్కొన్న అంశాన్ని పట్టించుకోకుండా సర్వే రిపోర్టు ఇవ్వాలని కోరారు. ఆ తర్వాత గ్రామ సర్వేయర్ కొన్ని సుధీర్ చేతివాటం చూపించారని క్షేత్రస్థాయి విచారణలో బాధిత రైతుల ఇచ్చిన వాంగ్మూలం పక్కన పెట్టి ఏడీ విజయ్‌కుమార్ పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని గ్రీవెన్స్‌ను క్లోజ్ చేశారు. లోపెంట రెవెన్యూ గ్రామం రీ-సర్వేలో కొన్ని సుధీర్, కొన్ని సతీష్, బోర శైలజ, వీఆర్వో అంబటి మల్లేశ్వరరావు కలిసి అక్రమాలకు పాల్పడ్డారని బాధిత రైతులు ఇప్పటికీ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నెల 16న లోపింటి గ్రామం నుంచి బి.గురుదేవి రీ-సర్వేలో జరిగిన అక్రమాలపై ఫిర్యాదు చేశారు. న్యాయస్థానంలో వివాదం నడుస్తున్న భూమిని వేరొకరి పేరుతో మార్చేసారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలాంటి ఫిర్యాదులు లోపెంట రెవెన్యూ గ్రామం పరిధిలో వందల్లో ఉన్నాయని బాధిత రైతులు చెబుతున్నారు. సర్వేలో పాల్గొన్న గ్రామ సర్వేయర్లు, వీఆర్వో కలిసి రైతుల పేర్లను తమకు నచ్చిన విధంగా మార్పులు చేసి భూములపై హక్కులు కట్టబెట్టారు. లోపెంట గ్రామ సర్వేయర్ శైలజ వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లిపోవడంతో వీఆర్వో అంబటి మల్లేశ్వరరావుకు కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోవడంతో సర్వే బృందంలో డిప్యూటేషన్‌పై గ్రామ సర్వేయర్లుగా వచ్చిన కొన్ని సుధీర్, సతీష్ సోదరులు ఇద్దరూ భారీ స్థాయిలో డబ్బులు తీసుకొని భూరికార్డులను తారుమారు చేశారని బాధిత రైతులు ఆరోపిస్తూ గ్రీవెన్స్‌లోనూ, ఆ తర్వాత ఇటీవల రీ-సర్వే గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఫిర్యాదు చేస్తున్నారు. లావేరు మండలంలో అక్టోబర్ 22 నుంచి నవంబర్ 7 వరకు రీ-సర్వే చేసిన 18 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి 690 గ్రీవెన్స్‌ను రెవెన్యూ అధికారులు స్వీకరించారు. లోపెంటలో అక్టోబర్ 25న నిర్వహించిన గ్రామసభలో 87మంది రైతులు రీ-సర్వే తర్వాత జరిగిన అక్రమాలపై ఫిర్యాదులు చేశారు. ఇందులో ఎక్కువగా విస్తీర్ణంలో మార్పులు, ఎల్‌ఎంపీలో వేరొకరి పేరు చేర్చడం, పట్టాదారులో వివరాలు తారుమారు, ప్రభుత్వ భూములను పట్టా భూములుగా చూపించడం తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయి. ఈ లెక్కన ఆ రెవెన్యూ పరిధిలో ఎంతమంది బాధితులు ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. గ్రామ సర్వేయర్ల నిర్వాకం - మిగతా 4లో



• ఎడిటోరియల్

# ట్రంపరితనం తగ్గలేదు

అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ మరోసారి మనదేశాన్ని బెదిరించాడు. తమ ఉత్పత్తులను దిగుమతి చేసుకొనే ఏ దేశమైనా వాటి మీద పన్నులు విధిస్తే తాము కూడా దెబ్బకు దెబ్బతీస్తామని అలాంటి దేశాలలో భారత్ కూడా ఉందని ట్రంప్ విలేకర్ల సమావేశంలో చెప్పాడు. తొలిసారి అధికారానికి వచ్చినపుడు చైనాపై వాణిజ్యపోరును ప్రారంభించటమే కాదు, మన దేశం నుంచి చేసుకొనే దిగుమతులపై ప్రాధాన్యత వ్యవస్థ విధానం(జిఎస్‌పి)లో భాగంగా ఇస్తున్న రాయితీలను కూడా రద్దు చేసిన పెద్దమనిషి ట్రంప్. మన దేశాన్ని తమ వలలోకి లాక్కొనేందుకు అంతకు ముందు అమెరికా విసిరిన బిస్కెట్ వంటిది ఆ రాయితీ. ట్రంప్ చర్యకు ప్రతిగా మనం కూడా అమెరికా ఉత్పత్తులపై పన్ను విధింపునకు పూనుకున్నాం. వాటి మీద ప్రపంచ వాణిజ్య సంస్థలో పరస్పరం మూడేసి కేసులు దాఖలు చేశారు. వాటిని పరిష్కరించుకోవాలని కొద్ది నెలల క్రితం ఇరుదేశాలు ఒక అవగాహనకు వచ్చాయి. ఆ స్ఫూర్తిని దెబ్బతీసేందుకు ట్రంప్ పూనుకున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం అమెరికా నుంచి మనం చేసుకొనే దిగుమతుల కంటే మన ఎగుమతులే ఎక్కువగా ఉండి వాణిజ్య మిగులులో ఉన్నాం. దాన్ని పూడ్చేందుకు తమ వస్తువులను కొనుగోలు చేయాలని లేకుంటే వాణిజ్యపోరుకు దిగుతానని హెచ్చరించటమే ట్రంప్ మాటల అంతరార్ధం. పరస్పరం ఇచ్చిపుచ్చుకోవటమనే పదం ఎంతో ముఖ్యం. వారు ఒక సైకిలు పంపితే మేము మరో సైకిలు పంపుతాం. వారు గనుక వంద లేదా రెండువందల శాతం పన్ను విధిస్తే మేమూ అదే చేస్తాం. చైనా, బ్రెజిల్, భారత్ వంటి దేశాలు అలా చేస్తున్నాయన్నాడు. వారు మార్చుకుంటే మంచిది లేకుంటే మేమూ అదే చేస్తాం అన్నాడు. ప్రపంచ వాణిజ్య సంస్థ సమాచారం ప్రకారం 2023లో రక్షణ చర్యల్లో భాగంగా తృణధాన్యాలపై 193 శాతం, పాల ఉత్పత్తుల మీద 188, ఖనిజాలు, లోహాలపై 187, నూనెగింజలు, ఖాద్యతైలాలపై 164, పానీయాలు, పొగాకుపై 150, పండ్లు, కూరగాయలపై 132, రసాయనాలపై 56, కాఫీ, టీ, సుగంధ ద్రవ్యాలపై 53, చేపలు, వాటి ఉత్పత్తులపై 35 శాతాల చొప్పున అమెరికా దిగుమతి పన్ను విధిస్తున్నది. దాని నిర్వాకం ఇలా ఉంటే ఇతర దేశాలపై ఎదురుదాడికి దిగుతున్నది. జో బైడెన్‌తో మన దేశం కుదుర్చుకున్న అవగాహన ప్రకారం ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై పన్ను తగ్గి ఎగుమతి అవకాశాలు మెరుగుపడతాయని ఆ రంగాల వారు ఆశిస్తుండగా ట్రంప్ చేసిన తాజా ప్రకటనతో పరిస్థితి తిరిగి మొదటికి వస్తుందా? అన్న అనుమానం కలుగుతున్నది. అయితే మీ ఇల్లు మా ఇంటికి ఎంత దూరమో మాదీ అంతే అన్న లోకోక్తి తెలిసిందే. అమెరికా లేకపోతే పూట గడవదు అనే పరిస్థితి ఎవరికీ లేదు, అమెరికాతో సహా అన్ని దేశాలూ ఏదో ఒకదాని కోసం ఇతరుల మీద ఆధారపడాల్సినవే. జపాన్ సంస్థ నోమురా అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ముందు వెల్లడించిన నివేదికలో ట్రంప్ గెలిస్తే రెండు దేశాల మధ్య ఉన్న వాణిజ్య విబేధాలను పక్కన పెడతాడని, చైనాపై ఆంక్షలను పెంచుతాడని, దాని స్థానంలో భారత్‌ను ముందుకు తెస్తాడని, అది ఎంతో ఉపయోగమని చెప్పింది. ఇక ట్రంప్ గతానికి వస్తే మన దేశం గురించి అన్న మాటలు ఇన్నిన్ని కాదు. అయినప్పటికీ 'అబ్‌కి బార్ ట్రంప్ సర్కార్' అంటూ ప్రధాని నరేంద్రమోడీ అమెరికా వెళ్లి మరీ అక్కడ ప్రచారం చేసి వచ్చారు. అయితే గత ఎన్నికల్లో ట్రంప్ మట్టికరిచాడు. మోడీ పరువు గంగలో కలిసింది. దిగుమతి పన్నులను భారత్ దుర్వినియోగపరుస్తున్నదన్నాడు ట్రంప్. ప్రపంచంలో ఎక్కువ మొత్తాలను విధిస్తున్న దిగుమతి పన్నుల చక్రవర్తి వంటి పదాలతో అవమానించాడు. అంతర్జాతీయ లావాదేవీలలో డాలర్‌ను పక్కన పెట్టాలన్న బ్రిక్స్ దేశాలు వెనక్కు తగ్గి అలాంటిదేమీ లేదని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లేకుంటే ప్రతికూల చర్యలు తప్పవని బెదిరించాడు. ఇటీవలి సంవత్సరాలలో మనదేశ విదేశీ వాణిజ్య భాగస్వాములలో చైనా, అమెరికా ఒకటి రెండు స్థానాలలో ఉంటున్నాయి. హెచ్1బి వీసాల గురించి అనేక ఊహాగానాలు సాగుతున్నాయి. గడచిన పదేళ్లలో చూస్తే అవి తగ్గాయి తప్ప పెరగలేదు. అమెరికా విధాన జాతీయ సంస్థ (ఎన్ఎఫ్‌ఎపి) సమాచారం ప్రకారం 2014-15లో ఉన్న వీసాల సంఖ్యతో పోలిస్తే ఎనిమిదేండ్ల కాలంలో 75 శాతం తగ్గాయి, అమెరికాలోని మన దేశ కంపెనీల రిక్రూట్‌మెంట్లు కూడా తగ్గాయి. అమెరికాకు అగ్రస్థానమే తన లక్ష్యం అని చెబుతున్న ట్రంప్ అధ్యక్షుడుగా కొలువు తీరాక నిజంగా ఏం చేస్తాడో చూడాల్సి ఉంది.

# సేవలోనే ఆనందం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం )

ప్రస్తుతం జిల్లాలో చలి అధికంగా ఉండటంతో నిరాశ్రయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిరాశ్రయులు బస్ స్టేషన్, దేవాలయాల వద్ద,ప్రభుత్వ హాస్పిటల్ వివిధ మండపాల వద్ద ఆరుబయట చలికి వణుకుతూ, బ్రతుకు జీవుడా అంటూ తన జీవనాన్ని కొనసాగిస్తున్నారు. అటువంటి నిరాశ్రయులకు పట్టణంలోని అరసవిల్లిలో ఉన్న ఇంజరాపు మోహనరావు, సహాయంతో దుప్పట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఇంజరాపు మోహనరావు మాట్లాడుతూ సేవలోనే ఆనందం ఉందని, మానవసేవ సేవ అన్న సూక్తితో తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పేదలను ఆదుకోవడం, అనాధలకు, నిరాశ్రయులకు భోజనంతోపాటు ఇటువంటి దుప్పట్లు పంపిణీ చేయడం తనకెంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అనంతరం అనాధలు నిరాశ్రయులు పంచడానికి సహకరించిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నవతరం నవ చైతన్య, బత్తిలి రమేష్,జీల్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ జాడ సాయి, రెడ్‌క్రాస్ నంది ఉమా శంకర్, సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి పొడుగు చరణ్‌లున్నారు.




## శర్వాణిలో ముందస్తు 'రామానుజన్' జయంతోత్సవం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక అరసవల్లి రోడ్‌లో గల 'శర్వాణి విద్యాలయ'లో గణిత పితామహుడైన శ్రీ శ్రీనివాసరామానుజన్ 137వ జయంతోత్సవం జరిగింది. సంస్థ అధినేత అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ శ్రీనివాసరామానుజన్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు మాట్లాడుతూ శ్రీనివాసరామానుజన్ స్ఫూర్తిగా తీసుకొని గణితంలో ప్రతి విద్యార్థి సాధన చేసి పేరు ప్రఖ్యాతులు తీసుకురాగలరన్నారు. పాఠశాల హెడ్మిస్ట్రెస్ డాక్టర్ కె.రేఖ మాట్లాడుతూ భారతదేశ విశిష్ట గణిత శాస్త్రవేత్త రామానుజన్ నెంబరు 1729 ఒక విశేషమైన నెంబరని, భారతదేశం వేదగణితానికి పుట్టినిల్లని, సాధనతో గణిత ప్రజ్ఞ సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రీ మిత్ర అకాడమీ డైరెక్టరు ఎం.అప్పలసూరి గణత ఉపాధ్యాయులను సన్మానించారు. అదే విధంగా టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చాటినవారికి బహుమతులు, సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమములో వి.సత్యవాణి, గణిత ఉపాధ్యాయులు డి.రవి, కె.త్రినాధ్, ఎ.దీర్ఘమణి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## అనుబంధ విభాగాల అధ్యక్షులకు అభినందనలు



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

వైకాపా అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులుగా నియమితులైన వారికి మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం అభినందించారు. ఈమేరకు తన కార్యాలయంలో కలిసిన వారిని అభినందించారు. జిల్లా రైతు విభాగం అధ్యక్షులుగా గొర్లె అప్పలనాయుడు, గారిని, జిల్లా వైయస్సార్‌టీయూసి అధ్యక్షులుగా లంకలపల్లి ప్రసాదరావు, జిల్లా పంచాయితీరాజ్ వింగ్ అధ్యక్షులుగా నేతింటి నీలమప్పడులు నియమితులయ్యారు. వీరు మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిని కిరణ్ దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ వైకాపా అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయవద్దని సూచించారు. వైకాపా ఎల్లప్పుడూ ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతీ ఒక్కరిని పార్టీ గుర్తించి ఈ విధంగానే పదవులు ఇస్తామన్నారు. అనంతరం జిల్లా అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులుగా నియమించబడిన ఈ ముగ్గురు మాజీ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్‌ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డుమెంబర్లు, మండల జేసిఎస్ కన్వీనర్లు, కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు, అధ్యక్షులు, పిఎసిఎస్ మాజీ డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అన్ని విభాగాల పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా మొదటి ప్రపంచ ధ్యాన దినోత్సవం



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం శ్రీకాకుళం ప్రాంగణంలో మొదటి ధ్యాన దినోత్సవం యోగా విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు ధ్యానసాధన చేశారు. డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ మాట్లాడుతూ ధ్యాన సాధన ప్రతి రోజూ చేయాలని, దీని వలన వ్యక్తిత్వ వికాసం, మన శ్శాంతి లభిస్తాయన్నారు. ముఖ్యంగా యోగా అధ్యాపకుల సూచనలతో చేయడం వలన బహుళ ప్రయోజనాలు పొందగలరన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యోగా గురువు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులంతా ధ్యాన ప్రక్రియను ఒక దినచర్యగా మలుచుకోవడం వలన కోపం తగ్గుతుందన్నారు. మానసిక ఒత్తిడి కూడా రాకుండా చేస్తుందన్నారు. ఏకాగ్రత పెరగడంతో పాటు అంతర్గత శాంతి, బుద్ధికుశలత కలుగుతుందన్నారు. దీని ద్వారా చదువులో ముందంజ వేయడంతోపాటు దేశ ఉత్తమపౌరులుగా తయారుకాగలరన్నారు. కార్యక్రమంలో ఏఓ ముని రామకృష్ణ, డీన్ మోహనక్రిష్ణ చౌదరి, డీన్ వెల్ఫేర్ జి.రవి, క్యాంపస్ డాక్టర్ కె.అరుణబాలాజీ, యోగా విభాగాధిపతి డాక్టర్ జి.ఈశ్వరరావు, యోగా శిక్షకులు కె.అర్చన, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పి.ముకుందరావు, అధ్యాపకులు సీహెచ్ పోలిరాజులు పాల్గొన్నారు.



వైకాపా అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని 47వ వార్డు వైకాపా ఇన్‌చార్జ్ ఆబోతుల రామ్మోహన్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎంవీ పద్మావతి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. - సత్యంన్యూస్, శ్రీకాకుళం




# కొంచెం బలం..కొంచెం భారం!!

ఒకప్పుడు కామెడీ పాత్రలకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచిన అల్లరి నరేష్.. కొన్నేళ్ల నుంచి ఎక్కువగా సీరియస్ పాత్రలే చేస్తున్నాడు. 'నాంది'లో ఇంటెన్స్ పాత్రతో ఆకట్టుకున్న అతను.. ఇప్పుడు 'బచ్చల మల్లి' అనే మరో సీరియస్ క్యారెక్టర్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. 'సోలో బ్రతుకే సో బెటర్' సినిమాతో దర్శకుడిగా పరిచయం అయిన సుబ్బు మంగాదేవి ఈ చిత్రాన్ని రూపొందించాడు. ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్ర విశేషాలేంటో చూద్దాం పదండి.

**కథ:**

గోదావరి ప్రాంతంలోని తుని మండలంలో సురవరం అనే ఊరిలో బచ్చలమల్లి (అల్లరి నరేష్) అనే కుర్రాడుంటాడు. అతను చిన్నప్పుడు తెలివైన విద్యార్థి. పదో తరగతిలో జిల్లాలోనే అగ్రస్థానంలో నిలుస్తాడు. అతడికి తండ్రంటే చాలా ఇష్టం. తండ్రికీ అతనంటే ప్రాణం. ఐతే తనెంతో ప్రేమించే తండ్రి చేసిన ఒక తప్పుతో అతణ్ని అసహ్యించుకుంటాడు. తండ్రి మీద ద్వేషం పెంచుకుని.. చదువు మీద ధ్యాస తగ్గిస్తాడు మల్లి. ఈ క్రమంలోనే చెడు వ్యసనాలకు కూడా బానిస అయిపోతాడు. తండ్రి ఎంత సర్దిచెప్పాలని చూసినా అతడిలో మార్పు రాదు. రోజు రోజుకూ మూర?ంగా తయారవుతున్న మల్లిలో కావేరి (అమృత అయ్యర్) పరిచయంతో మార్పు వస్తుంది. అతను వ్యసనాలు వదిలేసి ప్రయోజకుడయ్యే ప్రయత్నం చేస్తాడు. కానీ కావేరితో పెళ్లి దగ్గర సమస్య తలెత్తి మళ్లీ మల్లిలోని మూరు?డు బయటికి వస్తాడు. ఈ క్రమంలో తన జీవితం ఎలాంటి మలుపు తిరిగింది.. ఇంతకీ కావేరిని అతను పెళ్లి చేసుకున్నాడా లేదా.. తండ్రితో అతడి గొడవ ఎక్కడిదాకా వెళ్లింది.. ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం తెర మీదే చూసి తెలుసుకోవాలి.

**కథనం-విశ్లేషణ:**

ఇప్పుడు హీరో అంటే రాముడు మంచి బాలుడు అంటే ఎంతమాత్రం కాదు. ఎంతగా నెగెటివ్ షేడ్స్ ఉంటే అది జనాలకు అంత ఎక్కేస్తోంది. పుష్ప-2 రూపంలో తాజా ఉదాహరణ కళ్ల ముందు కనిపిస్తోంది. ఐతే హీరోలో ఎంత నెగెటివ్ టచ్ ఉన్నా సరే.. అందులో ఎక్కడో హ్యూమన్ యాంగిల్ కనిపించాలి. అతను ఎంత యాటిట్యూడ్ చూపించినా.. ఎంత మూర్ఖంగా ప్రవర్తించినా.. అందులో ఒక హీరోయిజం కనిపించాలి. అది ఎలివేషన్ కు ఉపయోగపడాలి. అప్పుడే ప్రేక్షకులు ఎంటర్టైన్ అవుతారు. అలా కాని పక్షంలో ప్రేక్షకులకు అసహనమే కలుగుతుంది. 'బచ్చలమల్లి'తో ఉన్న ప్రాబ్లం ఇదే. పట్టువిడుపులు లేకపోతే.. మరీ మూర్ఖత్వానికి పోతే.. జరిగే నష్టం పూడ్చలేనిది.. చివరికి మిగిలేది ఏమీ లేదు.. అనే సందేశం ఇవ్వదలుచుకున్నాడు 'బచ్చల మల్లి' ద్వారా దర్శకుడు సుబ్బు మంగాదేవి. అతడి ఆలోచన బాగుంది. అలాగే పరమ మూరు?డైన పాత్రలో అల్లరి నరేష్ పెర్ఫామెన్స్ కూడా అదిరిపోయింది. కానీ కథగా బాగానే అనిపించినా.. ఎగ్జిక్యూషన్లో పట్టు లేకపోవడం.. పైన చెప్పుకున్నట్లు హీరో పాత్ర అసహనం కలిగించడమే తప్ప.. వినోదాన్ని పంచకపోవడం.. అవసరం లేని సన్నివేశాలతో సాగతీతగా అనిపించడం 'బచ్చల మల్లి'కి మైనస్ అయ్యాయి. కొన్ని స్టాండౌట్ ఎపిసోడ్లు.. మంచి పెర్ఫామెన్సులు ఎంగేజ్ చేసినా.. పూర్తి స్థాయిలో మాత్రం మెప్పించలేకపోయింది 'బచ్చల మల్లి'. బచ్చల మల్లి నిజ జీవిత గాథే కావడం విశేషం.

ఆ పేరుతో ఓ మనిషి నిజంగానే ఉన్నాడు. అతడి కథకే కొన్ని కల్పితాలు జోడించి.. సినిమాగా మలిచాడు సుబ్బు మంగాదేవి. తన జీవితంలో జరిగిన కొన్ని ముఖ్య ఘటనలను ప్రభావవంతంగా తెరపై చూపించడంలో సుబ్బు విజయవంతం అయ్యాడు. ఆ ఘటనల్ని బట్టి చూస్తే.. సినిమా తీయడానికి అవసరమైన సరకు తన కథలో ఉన్నట్లే అనిపిస్తుంది. ఐతే నిజ జీవితాన్ని ఉన్నదున్నట్లు చూపిస్తే ప్రేక్షకులు ఎంటర్టైన్ కావడం కష్టం. ఎందుకంటే వాస్తవ కథల్లో కొన్ని సంఘటనల వరకు ప్రత్యేకంగా అనిపించొచ్చు కానీ.. సినిమాకు అవసరమైన డ్రామా అందులో ఉండకపోవచ్చు. అలాంటపుడు వాస్తవ కథకు 'సినిమా' టచ్ ఇవ్వడంలోనే రచయితలు.. దర్శకుల నేర్పు ఉంటుంది. ఐతే ఈ పనిని సంతృప్తికర స్థాయిలో చేయలేకపోయింది సుబ్బు అండ్ టీం. హీరో అంత మూర్ఖుడిగా తయారవడానికి దారి తీసే పరిస్థితులను.. అలాగే తన మూర్ఖత్వంతో జరిగిన విషాద ఘటనలకు సంబంధించిన ఎపిసోడ్లను మాత్రం సుబ్బు చాలా బాగా తీశాడు. అవి హార్డ్ హిట్టింగ్ గా అనిపిస్తాయి. ప్రేక్షకులను కదిలిస్తాయి. కానీ ఈ ఘటనల మధ్య ఆసక్తికర సన్నివేశాలతో సినిమాను ఎంగేజింగ్ గా నడిపించడంలో మాత్రం దర్శకుడు విఫలమయ్యాడు. అక్కడే 'బచ్చల మల్లి' పట్టు కోల్పోయింది. 'బచ్చలమల్లి'లో తండ్రీ కొడుకులమధ్య బంధాన్ని.. వారి మధ్య వైరాన్ని తక్కువ సన్నివేశాల్లోనే బలంగా చూపించాడు దర్శకుడు. దీనికి సంబంధించిన ఆరంభ సన్నివేశాలు సినిమా మీద మంచి అంచనాలు రేకెత్తిస్తాయి. కానీ ఆ తర్వాత మాత్రం సాధారణ సన్నివేశాలతో మామూలుగా సాగిపోతుందీ చిత్రం. హీరో ప్రేమకథ కానీ.. కుటుంబ సన్నివేశాలు కానీ ఏమంత ఆసక్తి రేకెత్తించవు. ఎప్పుతూ తాగుతూ.. మూర్ఖంగా ప్రవర్తిస్తూ.. బాధ్యత లేకుండా తిరిగే హీరోను మంచి కుటుంబంలో పెరుగుతూ చక్కగా చదువుకుంటున్న అందమైన అమ్మాయి అయిన హీరోయిన్ ప్రేమించడానికి బలమైన కారణం కనిపించదు. ఐతే హీరోను హీరోయిన్ పరీక్షించే ఒక్క సన్నివేశం మాత్రం ప్రత్యేకంగా అనిపిస్తుంది. అది ప్రేక్షకులను సర్ప్రైజ్ చేస్తుంది. హీరో తన తండ్రితో మరీ కర్కశంగా ప్రవర్తించే ఓ ఎపిసోడ్ కూడా బాగానే ఎంగేజ్ చేస్తుంది.

ప్రథమార్ధం వరకు ఓ మోస్తరుగా అనిపించే 'బచ్చలమల్లి' రెండో అర్ధంలో కథ పరంగా అసలు కదలికే లేక భారంగా తయారవుతుంది. హీరో-విలన్ మధ్య వైరం ఏమాత్రం ఆసక్తి రేకెత్తించదు. అందులో బలమైన కాన్ఫ్లిక్ట్ ఏమీ కనిపించదు. విలన్ పాత్ర నామమాత్రంగా అనిపిస్తుంది. హీరోయిన్ని దూరం చేసుకోవడంలో హీరో చూపించే మూర్ఖత్వం మరీ అసహజంగా అనిపిస్తుంది. ద్వితీయార్ధంలో చాలాసేపు ఈ అసహనమే కొనసాగుతుంది. దారీ తెన్నూ లేకుండా సాగే కథ విసుగెత్తిస్తుంది. అనవసర సన్నివేశాలతో

రాను

రాను 'బచ్చల మల్లి' గ్రాఫ్ పడిపోతూ వెళు_ంది. ఐతే ప్రి క్లైమాక్స్ నుంచి పుంజుకునే సినిమా.. మంచి ముగింపుతో పర్వాలేదనిపిస్తుంది. కానీ అంతకు ముందు జరిగిన నష్టాన్ని భర్తీ చేసే స్థాయిలో మాత్రం పతాక సన్నివేశాలు లేవు. 'బచ్చల మల్లి' రెండు మూడు బలమైన ఎపిసోడ్లు.. అల్లరి నరేష్ పెర్ఫామెన్స్ మీద ఎక్కువ ఆధారపడ్డ సినిమా. కానీ రెండున్నర గంటల్లో ఆ కొన్ని ఎపిసోడ్లు.. హీరో పెర్ఫా మెన్స్ మాత్రమే సినిమాను సేవ్ చేస్తాయా అన్నది ప్రశ్న.

**నటీనటులు:**

కామెడీ పాత్రలు చేస్తున్నపుడు తెలియ లేదు కానీ.. అల్లరి నరేష్ ఎంత మంచి నటుడో అతను సీరియస్ పాత్రలు చేస్తున్నపుడే బాగా తెలుస్తోంది. బచ్చల మల్లి పాత్రలో అతను జీవించేశాడు. ఒక దశ దాటాక నరేష్ కాకుండా చూసేవాళ్లకు మల్లినే కనిపిస్తాడు. తనను పట్టుకుని కొట్టాలనిపించే ఫీలింగ్ తీసుకువస్తాడంటే అతను ఆ పాత్రలో ఎంతగా ఒదిగిపోయాడో అర్థం చేసుకోవచ్చు. పతాక సన్నివేశాల్లో తన నటన మరింత బాగుంది. నరేష్ తర్వాత ఎక్కువ మెప్పించేది రావు రమేష్. చాలా తక్కువ సన్నివేశాల్లోనే ఆయన తన ప్రత్యేకతను చాటుకున్నాడు. హీరో హీరోయిన్ని అడగడానికి తన ఇంటికి వచ్చిన సీన్లో.. అలాగే క్లైమాక్సులో రావు రమేష్ భలేగా చేశాడు. హీరోయిన్ అమృత అయ్యర్ ఓకే. ఆమె పాత్రకు తగ్గట్లుగా నటించి మెప్పించింది. రోహిణి తల్లి పాత్రలో మరోసారి అద్భుతంగా నటించింది. తల్లి పాత్రల్లో ఇంత సహజంగా ఒదిగిపోయే నటి ఈ రోజుల్లో ఇంకొకరు కనిపించరు. తండ్రి పాత్రలో బలగం నటుడు జయరాం కూడా బాగా చేశాడు. హరిప్రియ.. ప్రవీణ్.. హర్ష చెముడు.. వీళ్లంతా సహాయ పాత్రల్లో చక్కగా నటించారు. విలన్ పాత్రలో కన్నడ నటుడు అచ్యుత్ కుమార్ కూడా ఓకే.

**సాంకేతిక వర్గం:** విశాల్ చంద్రశేఖర్ సంగీతం ఓకే. పాటల్లో చార్ట్ బస్టర్ అనిపించే సాంగ్ ఏదీ లేకపోవడం మైనస్సే కానీ.. తీసిపడేసేలా మాత్రం లేవు. తెర మీద అలా అలా సాగిపోతాయి. నేపథ్య సంగీతం బాగుంది. రిచర్డ్ ఎం.నాథన్ ఛాయాగ్రహణం నీట్ గా సాగింది. నిర్మాణ విలువలు సినిమాకు తగ్గట్లు బాగానే కుదిరాయి. కథకుడు-దర్శకుడు సుబ్బు మంగాదేవి 'బచ్చలమల్లి' కథను సిన్సియర్ గా చెప్పే ప్రయత్నం చేశాడు. ఐతే అతను కొన్ని ఎపిసోడ్లను నమ్ముకుని సినిమాను నడిపించేశాడు కానీ.. వాటిని మినహాయిస్తే చాలా వరకు కథ ఫ్లాట్ గా సాగిపోయింది. ఆరంభ.. చివరి ఎపిసోడ్ల మధ్య కథనం ఇంకా ఆసక్తికరంగా ఉండేలా చూసుకోవాల్సింది. స్క్రీన్ ప్లే ఎగుడుదిగుడుగా సాగి ఇబ్బంది పెట్టింది. ఎమోషనల్ సీన్లను మాత్రం సుబ్బు బాగా డీల్ చేశాడు. డైలాగులు కూడా బాగున్నాయి.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...



# ఇందిరXకిషోర్ దా అమిత్ షా చర్చతో మరోసారి తెరపైకి!

బినాకా గీత్ మాల.. 1970వ దశకంలో ఒక ఊపు ఊపిన రేడియో కార్యక్రమం. భారత్‌తో పాటు, పొరుగు దేశాలైన శ్రీలంక, పాకిస్థాన్ వంటి చోట్ల ఓ ఎమోషనల్ బాండ్ ఏర్పర్చుకున్న రేడియో షో. అదే సమయంలో 1975-77 మధ్య ఎమర్జెన్సీ సమయంలో ఇందిర కుటుంబానికీ, సుప్రసిద్ధ గాయకుడు కిషోర్ కుమార్ మధ్య తలెత్తిన వివాదంతో.. ఏకంగా కిషోర్ కుమార్ పాటలపై కఠినమైన నిషేధాజ్ఞలు ప్రకటించి కూడా వార్తల్లో నిల్చింది. ఆ తర్వాత కిషోర్ కుమార్ స్వరం కేవలం రేడియోలో ఎందరో ఎదురుచూసే బినాకా గీత్ మాలలోనే కాదు.. సినిమాల్లో వినిపించొద్దు, ఇతర ప్రైవేట్ ఆల్బమ్స్ పైనా ఆయన పేరు కనిపించొద్దు.. దూరదర్శన్ లోనూ ఆయన పాడిన పాటలు ప్రసారం కావొద్దు.. అదిగో అంతలా కొనసాగింది ఆ నిషేధం. తాజాగా ఈ వివాదాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజ్యసభలో చర్చించి.. నాటి ఇందిరా గాంధీ కుటుంబీకులు వ్యవహరించిచ తీరును సభ ముందుంచే ప్రయత్నం చేయడంతో నాటి ఆ వివాదం మళ్లీ ఇప్పుడు తెరపైకొచ్చింది

ప్రస్తుతం శ్రీలంక బ్రాడ్ క్యాస్టింగ్ కార్పోరేషన్‌గా ఉన్న రేడియో సిలోన్ మాత్రమే అప్పుడు అంతర్జాతీయ ప్రసారసంస్థగా ఉండేది. ఆ సమయంలో 1952లో ప్రారంభమైన బినాకా గీత్ మాల భారతీయుల హృదయాలకు అత్యంత దగ్గరైన గీతాల కార్యక్రమంగా బహుళ ప్రజాదరణ పొందింది.

దానికి తోడు, భాయీ ఔర్ బహెనో అంటూ హోస్ట్ అమీన్ సయాని మెస్మరైజ్డ్ వాయిస్ తో.. సందర్భోచిత వ్యాఖ్యానంతో బినాకా గీత్ మాల కార్యక్రమం నాల్గు దశాబ్దాలపాటు శ్రోతలను ఉర్రూతలూగించింది. బస్తాలకు బస్తాలు ఉత్తరాలతో పోస్టల్ డిపార్ట్‌మెంట్ పడ్డ ఇబ్బందులు కూడా బినాకా గీత్ మాల ప్రసారంలో ఓ నోస్టాల్జియానే. అంతేకాదు, ప్రముఖ సంగీత దర్శకులు, పాటల రచయితలంతా ఎన్ని పనులున్నా బినాకా గీత్ మాల ప్రసారమయ్యే బుధవారం సాయంత్రానికి తమ చెవులను ఆల్ ఇండియా రేడియో వైపు రిక్కారించాల్సిందే! ఎందుకంటే ఒక్కోపాటను అమీన్ సయానీ విశ్లేషించే తీరుతో.. వినడానికి మాత్రమే వీనులవిందు కాకుండా ఆ పాట అర్థాన్ని, విలువను పట్టిచూపించేవి అమీన్ సయానీ మాటలు.

అలా ప్రతీ బుధవారం సాయంత్రం బినాకా గీత్ మాల కేవలం ఒక హిందీ గీతాల కార్యక్రమంగానే కాకుండా ప్రాంతాలు, సరిహద్దులు, భాషలన్న పట్టింపుల్లేకుండా ఎల్లలు లేని ఖ్యాతిని మూటగట్టుకుంది. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో అత్యధిక ఆదరణ పొందిన కార్యక్రమంగా గుర్తింపు పొందిన బినాకా గీత్ మాల కిషోర్ కుమార్ ధిక్కారస్వరంతో 70ల్లో ఒక్క కుదుపుకు లోనైంది.

## కిషోర్ కుమార్ పై నిషేధం!

1970ల్లో కిషోర్ కుమార్ కెరీర్ పీక్స్ లో ఉంది. ఎక్కడ చూసినా స్టేజ్ షోస్ నుంచి మొదలుకుంటే ఆల్ ఇండియా రేడియాలో, దూరదర్శన్ లో కిషోర్ దా పాటలే మార్మోగేవి. కానీ, చాలామంది చీకటి రోజులని విమర్శించే ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించిన 1975 కాలం.. బినాకా గీత్ మాలాకు బ్యాడ్ డేస్ తెచ్చింది. ముఖ్యంగా సుప్రసిద్ధ గాయకుడిగా ఒక ఊపు ఊపుతున్న కిషోర్ కుమార్ పాటల పరంపరకు ఒక ఆకస్మిక విరామమేర్పడింది.

ఇందిర చిన్న కుమారుడైన సంజయ్ గాంధీ హవా నడుస్తున్న రోజులవి. ఆ సమయంలో ఇందిర ప్రభుత్వం సంజయ్ గాంధీ బ్రెయిన్ చైల్డ్‌గా పేర్కొనే పేదరిక నిర్మూలన, నాణ్యమైన జీవితాన్ని పేద ప్రజలందరికీ ఇవ్వాలన్న ఉద్దేశంతో ట్వంటీ పాయింట్ ప్రోగ్రామ్ ను చేపట్టింది. ఆ సమయంలో దాన్ని ఇందిర ప్రభుత్వం ప్రచారంలోకి తీసుకువెళ్లేందుకు బాలీవుడ్ వైపు చూసింది. ప్రముఖులతో మాట్లాడించడం, వాటి కార్యక్రమాలకు సంబంధించిన గీతాలను రాయించి, పాడించాలని నిర్ణయించుకున్నారు. రాజకీయంగా వాటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు సంజయ్ గాంధీ అప్పటికే టాప్ మోస్ట్ సింగర్ గా, బినాకా గీత్ మాలతో మరింత ప్రజలకు చేరువైన కిషోర్ కుమార్ తో పాటలు పాడించాలనుకున్నాడు. అందుకోసం ఢిల్లీలోని ప్రసార మంత్రిత్వశాఖలో అప్పుడు సీనియర్ అధికారిగా ఉన్న ముజఫర్ హుస్సేన్ బర్నీ నుంచి కిషోర్ కుమార్ ఓరోజు ట్రంక్ కాల్ అందుకున్నాడు. కానీ, తనకు నచ్చితేనేగానీ ఏదీ చేయని కిషోర్ దా అందుకు ససేమిరా అన్నాడు. స్వభావరీత్యా కొంత మొండితనముండటంతో.. కిషోర్ కుమార్ ను అప్పటి ఆల్ ఇండియా ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ అధినేత జీ.పీ. సిప్పీ, జాయింట్ సెక్రటరీ అయిన సీ. బీ. జైన్ వంటివారు కూడా బతిమాలారు. కానీ, కిషోర్ అనే మొండిఘటం మాత్రం తలొగ్గలేదు.

ఈ విషయాలన్నీ అనిరుధ్ భట్టాచార్జీ, పార్థీవ్ ధర్ రచించిన.. కిషోర్ కుమార్: ది అల్టిమేట్ బయోగ్రఫీలో పేర్కొన్నారు. అప్పటికే అవసరమైతే వీధుల్లో హార్మోనియం జబ్బకు వేసుకుని అడుక్కున్నా మంచిదేగానీ.. ప్రభుత్వం చెప్పిన పాటలు మాత్రం పాడొద్దన్నంత గట్టిగా కిషోర్ కుమార్ తీర్మానించుకున్నాడు.

కిషోర్ మంకుపట్టును నాటి ఇందిర ప్రభుత్వం కూడా జిద్దుగా తీసుకుంది. విద్యాశరణ్ శుక్లా నేతృత్వంలోని ప్రసార మంత్రిత్వశాఖ ఆల్ ఇండియా రేడియోతో పాటు, దూరదర్శన్ లో కిషోర్ పాటలను ఎక్కడా ప్రసారం చేయొద్దని మూడు నెలల పాటు నిషేధం విధించింది. అంతేకాదు, కిషోర్ పాటల రికార్డుల అమ్మకాలను కూడా అడ్డుకునేందుకు గ్రామఫోన్ రికార్డ్ కంపెనీలకు కూడా ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాలను నాటి హెచ్ఎంవీ కంపెనీ శిరసావహిస్తే.. పాలిడోర్ కంపెనీ మాత్రం ప్రతిఘటించింది.

కానీ, బినాకా గీత్ మాల కౌంట్ డౌన్ షోలపై కిషోర్ పాటల్లేని ప్రభావం అమితంగా కనిపించింది. శ్రోతలు మొత్తం వ్యవహారాన్ని గమనిస్తూనే ఉన్నారు. బినాకా గీత్ మాలలో బాలీవుడ్ పాటల రారాజు కిషోర్ పాటల్లేకపోవడం చర్చనీయాంశమైంది. మరోవైపు ప్రైవేట్ షోలల్లోనూ కిషోర్‌ను బహిష్కరించాలంటూ రహస్య ఆదేశాలూ జారీ అయ్యాయి. లత, ఆశాభోంస్లేతో కలిసి పాడిన ఎన్నో డ్యూయెట్స్ ప్రసారాన్ని ఆపేసి.. సింగిల్ ఫిమేల్ ట్రాక్స్ మాత్రమే ప్లే అయ్యేవి. మొత్తంగా కిషోర్ కుమార్ పై ఇందిర ప్రభుత్వ కక్షసాధింపు కూడా నాటి ఎమర్జెన్సీ తీవ్రతను పట్టిచూపేదే.

అలాంటి నిషేధం ఒకవైపు కొనసాగుతుంటే.. కిషోర్ అప్పటికే పాటలు పాడిన సినిమాలను మాత్రం చూసేందుకు జనాలు ఎగబడ్డారు. అలా సినిమా హాళ్లు క్యూలతో నిండిపోయి.. ఎమర్జెన్సీకి, నాటి ఇందిర ప్రభుత్వానికి తిరుగుబాటుకు ప్రతీకలా ఓ నిశ్శబ్ద విప్లవానికి దారితీసింది.

## రాజ్యసభలో షా చర్చ!

2024, డిసెంబర్ 17వ తేదీన మంగళవారం రోజున కేంద్ర హోంమంత్రి అమిత్ షా నాటి ఎమర్జెన్సీ కాలంలో ఇందిర ప్రభుత్వ వ్యవహారాన్ని ఉటంకిస్తూ కిషోర్ కుమార్ వంటి ఒక కళాకారుడిపై ఎలా కక్షసాధింపు చేసిందో దుయ్య బట్టాడు. తానూ బినాకా గీత్ మాల వినేవాడిని.. ఓరోజు సడెన్ గా ఆగిపోవడం.. కిషోర్ పాటలు మాయమైపోవడంతో ఆ తర్వాత తెలుసుకుంటే ఇందిరా గాంధీతో కిషోర్ కు ఏర్పడ్డ విభేదాలే కారణమని తెలిసిందని చెప్పుకొచ్చారు షా. అలా నాడు ఇందిర ఎంత నియంతృత్వంగా వ్యవహరించిందో మళ్లీ సభలో చర్చకు పెట్టి.. బినాకా గీత్ మాల.. అందులో కిషోర్ పాటల నిషేధాన్ని మరోమారు తెరపైకి తెచ్చారు.

## కిషోర్ పై నిషేధంపై నాటి బాలీవుడ్ పరిశ్రమ స్పందన!

ఇందిరాగాంధీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఒక్కసారి హిందీ చిత్ర పరిశ్రమ ఉలిక్కిపడింది. కానీ, మెల్లిగా కిషోర్ కుమార్ పక్కన చేరింది. సంగీత దర్శకుడు కళ్యాణ్ జీ ప్రభుత్వానికీ, కిషోర్ కు మధ్యవర్తిత్వం వహించారు. అయితే, తాను కిషోర్ కుమార్ కోసం మధ్యవర్తిత్వం చేయలేదని.. అందువల్ల కిషోర్ ప్రభావితమయ్యేది తక్కువేనని.. కానీ, ఆయన్ను నమ్ముకున్న నిర్మాతలు ఎలాంటి తప్పు చేయకుండా శిక్ష అనుభవించడం సరికాదనే తానో ముందడుగు వేసినట్టు ఆయన ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు.

కిషోర్ సోదరుడు అశోక్ కూడా జోక్యం చేసుకుంటే.. ఇందిర దిమ్మదిరిగే వ్యంగ్యాన్ని విసిరింది. అశోక్ కుమార్ ఇందిరను సంప్రదిస్తే బహుత్ గానా గాయా.. అబ్ జరా ఆరామ్ ఫర్మాయే అంటూ నాడు ఇందిర ఇచ్చిన సమాధానం అశోక్‌ను విచారానికి గురిచేసింది. ఆ సమయంలో కిషోర్ విశ్రాంతి తీసుకుంటూనే.. మరోవైపు అప్పుడప్పుడూ కొడుకు అమిత్‌తో కలిసి తన పుట్టిన ఊరు ఖాండ్వాలో ఉంటూ భారతదేశంలోని వివిధ ప్రదేశాలకు పర్యటనలను పెట్టుకున్నాడు. కన్యాకుమారి వివేకానంద రాక్ మెమోరియల్ వరకూ పర్యటిస్తూ దొరికిందే ఛాన్స్ అన్నట్టు సేదతీరాడు. ఆ సమయంలో రవీంద్ర సంగీత్ లో సాధన చేస్తూ, కొత్త ప్రయోగాలపై దృష్టి సారించారు.

కిషోర్ పాటలపై నిషేధాజ్ఞలు కొనసాగిన సమయంలో బినాకా గీత్ మాల పై కొంత ప్రభావం కనిపించిన మాట వాస్తవమేనని.. దాని హోస్ట్ అమీన్ సయానీ కొన్ని ఇంటర్వ్యూలలో అంగీకరించాడు. రాజకీయాలు రేడియో షో బినాకా గీత్ మాలను ప్రభావితం చేసినప్పటికీ.. ప్రజలకు ఏర్పడిన ఎమోషన్ బాండ్ తో.. 1990ల వరకూ ఆ రేడియో షో సూపర్ హిట్ గానే నడిచినట్టూ ఆయన చెప్పుకొచ్చారు.

## కిషోర్ పై నిషేధం ఎత్తివేత!

కిషోర్ కుమార్ ఓ సారీ చెబితే సరిపోతుంది. కానీ, మొండోడు. అవసరమైతే నేను పాడటం మానేస్తాను గానీ.. నాకిష్టం లేని పాటలు నేను పాడనంటే పాడనని భీష్మించాడు. ఆయన పాటలతో కనెక్టైన జనం ఆయన గొంతును ఎలాగోలా వింటూనే ఉన్నారు. అదంతా కూడా నాటి ఎమర్జెన్సీ సమయంలో ఇందిర ప్రభుత్వానికి నిశ్శబ్ద తిరుగుబాటులానే అనిపించేది.

ఏ ప్రసారశాఖా మంత్రి విద్యాచరణ్ శుక్లానైతే నిషేధం విధించారో.. ఆయనే మళ్లీ కిషోర్ పై నిషేధం ఎత్తివేతకు మూల కారణమయ్యాడు. కిషోర్ పుట్టిన ఊరు ఖాండ్వాలో విద్యాచరణ్ శుక్లాకు సంబంధాలున్నాయి. ఆ బంధమే మళ్లీ చర్చలకు తెరతీసింది.. కలిపింది. అలా 1976, జూన్ 14వ తేదీన కిషోర్ ప్రభుత్వానికి సహకరించడానికి ఒప్పుకోవడంతో.. నాటి జూన్ 16 నుంచి నిషేధం ఎత్తివేశారు. నిషేధం ఎత్తేసాక ఆల్ ఇండియా రేడియో కిషోర్ పాడిన దుఖీ మన్ మేరే అనే పాటను సింబాలిక్‌గా మొదటి పాటగా ప్లే చేసింది. అలా దేశవ్యాప్తంగా మళ్లీ కిషోర్ గొంతు ఆలిండియా రేడియోలో వినిపించడంతో ఆ గొంతుతో కనెక్టైన వారెందరిలోనో మళ్లీ ఆనందం వెల్లివిరిసింది.

ప్రభుత్వం చెప్పింది చేసి తీరాల్సిందేనన్న మాటను నిరాకరించడంతో కిషోర్‌కు సమస్యలెదురవ్వొచ్చుగానీ.. స్వేచ్ఛ కల్గిన ఓ కళాకారుడిగా మాత్రం కిషోర్ పేరు మార్మోగింది.

అలా ఆల్ ఇండియా రేడియో సేవలను 1988లో వివిధ భారతి కింద మార్చేశాక బినాకా గీత్ మాల పేరు కూడా సిబాకా గీత్ మాలాగా మారిపోయింది. 1990ల వరకూ కొనసాగిన బినా కా గీత్ మాలా భారతీయ సినీ సంగీత శ్రోతలతో ఓ ఉద్వేగభరితమైన బంధాన్నేర్పర్చుకోగా.. ఎమర్జెన్సీ సమయంలో కిషోర్ పై నిషేధం మాత్రం ఓ వివాదాస్పద చీకటి ఘట్టంగా చరిత్రలో నిల్చిపోయింది.

- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో..

# మడ్డువలస జలాశయం తొలిసారి ఎన్నికలు



(సత్యంన్యూస్, వంగర)

వంగర మండలం మడ్డువలస జలాశయం పరిధిలో తొలిసారి ఎన్నికలు రాజాం తహశీల్దార్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ప్రాజెక్టు జాతికి అంకితం చేసిన తర్వాత ఇవే మొదటి ఎన్నికలు కావడంతో రైతులు కుతూహలంతో ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. వంగర, రేగిడి, సంతకవిటి, జి.సిగడాం మండలాల పరిధిలో 15 సంఘాలు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో చైర్మన్‌గా సంతకవిటి మండలానికి చెందిన పున్నాన రామినాయుడు, వైస్ చైర్మన్‌గా జి.సిగడాం మండలానికి చెందిన బాలబొమ్మ వెంకటేశ్వర్లుని 15 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని మండలంలోని శ్రీశ్రీశ్రీ నీలమణి దుర్గమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి గోత్ర నామాలతో పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టి దుప్పట్లను కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. - సత్యంన్యూస్, పాతపట్నం

# ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్‌ని విడుదల చేయాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.3580 కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో శనివారం నిరసన చేశారు. ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నాగభూషణం జిల్లా ప్రధానకార్యదర్శి సిహెచ్.రవికుమార్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, నెలలు గడుస్తున్నా, విద్యా దీవెన, వసతి దీవెనలను (ఎంటీఎఫ్, ఆర్‌టీఎఫ్) మార్చింది తప్ప ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించడంలో అలసత్వం వహిస్తున్నదన్నారు. అందువల్ల విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి విద్యాసంస్థల యాజమాన్యాల వద్ద నుండి గురవుతున్నారన్నారు. ఇప్పటికే విద్యా సంవత్సరం పూర్తి చేసుకుని, ఫీజులు చెల్లించలేక కళాశాలల్లోనే సర్టిఫికెట్లు ఉంచి ఉన్నత విద్య చదవలేక, మరో పనికి వెళ్లలేక, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆమేరకు ప్రభుత్వ లెక్కల ప్రకారం, యాజమాన్యాల వద్ద 7లక్షల విద్యార్థులు సర్టిఫికెట్లు ఉంచారని, యాజమాన్యాల దగ్గర సర్టిఫికెట్ ఉండడం వల్ల ఎవరికి ప్రయోజనం కలుగుతుందో చెప్పాలన్నారు. మరో పక్క ప్రభుత్వం యాజమాన్యాల అందరికి పూర్తిగా చెల్లిస్తాం, విద్యార్థులకు అడ్మిషన్స్ సమయాల్లో, పరీక్షల సమయంలో ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు పెట్టకూడదు అనే స్పష్టమైన ఆదేశాలు లేకపోవడం వల్ల విద్యార్థుల వద్ద నుండే ముక్కుపిండి వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రభుత్వ యంత్రాంగం వీటన్నిటిని చూస్తూ ఉన్నారు తప్ప కార్యాచరణ సిద్ధం కావడం లేదన్నారు. కాబట్టి ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని, జీవో నెంబర్ 77ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పూర్ణ, రాజు, ప్రవీణ్, రమేష్ కుమార్, శ్రీను, దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు.

# రైతన్నలని తక్షణమే ఆదుకోవాలి

(సత్యంన్యూస్, పాతపట్నం)



బంగాళాఖాతంలో అల్ప పీడనం ప్రభావంతో గత రెండురోజుల నుంచి జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు పంట నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో వరి కోతలు పూర్తయి పొలాల్లో రైతులు కుప్పలు పెట్టి ఉన్నారన్నారు. తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఆందోళన పడుతున్నారు. పంట కోత కోసి పొలాల్లోనే కుప్పలు పెట్టడం వలన వర్షానికి సరైన సౌకర్యాలు లేకపోవడం చేత వాటిని కాపాడుకునేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవలసి వస్తుందని, దళారుల ఆగడాలను ఎదుర్కొనలేని కొంతమంది రైతులు తమ ధాన్యాన్ని కళ్లాల్లోనే ఉంచారన్నారు. వైకాపా ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సకల సౌకర్యాలు కల్పించి సేద్యం సజావుగా సాగేలా చూశామన్నారు. రైతులకు అవసరమయిన ఎరువులు, పురుగు మందులు, నాణ్యమయిన విత్తనాలను ఇంటి వద్దకే అందచేసిందని గుర్తు చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత పంటల బీమా అందించి అదుకుంది వైకాపా ప్రభుత్వమేనన్నారు.రైతులకు తక్షణమే ఆదుకొని తగిన నష్టపరిహారం అందజేయాలని ఆమె డిమాండ్ చేశారు.

# తూర్పుకాపు సామాజికవర్గ ఆత్మీయ సదస్సుకు తరలిరండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలో 30 లక్షల జనాభా కలిగిన తూర్పుకాపు సామాజిక వర్గం శ్రీకాకుళం జిల్లా మహా సమ్మేళనం ఈ నెల 29న ఎచ్చెర్ల కేశవరెడ్డి స్కూల్ పక్కన గల ఖాళీ స్థలంలో జరుగుతుంది. ఈ ఆత్మీయ కలయిక సదస్సుకు ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ఉన్న తూర్పుకాపు సామాజిక వర్గమంతా తరలిరావాలని జిల్లా తూర్పు కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు సురంగి మోహనరావు, డోల జగన్‌మోహన్, శాసపు జోగినాయుడు, ఇజ్జాడ శ్రీనివాసరావు, లంక శ్యామసుందర్, కిల్లారి నారాయణరావు, డాక్టర్ ఎం.రామ జోగినాయుడు, వాళ్ల శ్రీరాములునాయుడు పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రాలు, బ్రోచర్స్ శ్రీకాకుళం జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ఉన్న తూర్పుకాపు సామాజికవర్గ, ప్రతినిధులు, జాతిబిడ్డలు ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నో ఏళ్లుగా జాతి యావత్తూ కలలుకంటున్న తూర్పుకాపు సామాజిక వర్గ భవన్ నిర్మాణం త్వరలో జరగబోతుందని, దీనికి సంబంధించిన విరాళాలు ప్రకటించిన దాతలు తక్షణమే ఇచ్చి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా తూర్పు కాపు సామాజిక వర్గం ప్రతినిధులు డాక్టర్ చందక రామకృష్ణ, నేతల అప్పారావు, ఆబోతుల రామకృష్ణ, ఎం.శంకర్ నారాయణ, అధిక సంఖ్యలో నేతలు పాల్గొన్నారు.

ఎం.ఇర్షాద్
USHA ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# యోగా, ధ్యానంతోనే మానసిక ఉల్లాసం

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
- ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యోగాతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో వరల్డ్ మెడిటేషన్ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యోగా, ధ్యానంతోనే మానసిక ఒత్తిళ్లను జయించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని అన్నారు. సనాతన హైందవ ధర్మపరిరక్షణలో భాగంగా ప్రతిఒక్కరూ ధ్యానాన్ని సాధన చేయాలని ఎమ్మెల్యే కోరారు. జీవితంలో ప్రతిరోజు కొద్దిసేపు ధ్యాన సాధనకు కేటాయిస్తే ఒత్తిడి లేని సమాజాన్ని నిర్మించుకోవచ్చని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరూ చిన్నప్పట్నుంచే యోగాభ్యాసాన్ని అలవాటుగా మార్చుకొని నిరంతర సాధన చేయాలని సూచించారు. నేటి జీవన విధానంలో నిత్యం అధిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నామని, తద్వారా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముందన్నారు. ఇటువంటి తరుణంలో ధ్యానం, యోగ వంటివి చక్కని పరిష్కారంగా నిలుస్తాయని చెప్పారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ అమ్మన్నాయుడు, అపెక్స్ సభ్యులు గీతా శ్రీకాంత్‌లు మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి డిసెంబర్ 21ని ప్రపంచ ధ్యాన దినోత్సవంగా నిర్వహించాలని పిలుపు ఇచ్చిందని, ఇవాళ జరిగేది ప్రపంచ తొలి ధ్యాన దినోత్సవంలో అమెరికాలోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో మొట్టమొదటి ప్రపంచ ధ్యాన వేడుకల్లో ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్ తొలి ప్రసంగం చేశారని అన్నారు. ధ్యానం చేయడం అంటే విలాసవంతంగా చేసుకొనే కార్యక్రమం కాదని, ప్రతీ మనిషికి అది ఒక అవసరమని తెలిపారు. ప్రస్తుత సమాజంలో ప్రజలపై కోపం, కుంగుబాటు ప్రభావం అధికంగా ఉంటోందని, వాటిని జయించడానికి ధ్యానం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రోజూ 20 నిమిషాలు సాధన చేయాలని, ఇప్పటికే లక్ష మంది వాలంటీర్లు దీన్ని సాధన చేసి మరి కొంతమందికి నేర్పేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రపంచ శాంతి, సమగ్రత పెంపొందించడంలో ధ్యానం కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, ఇంటాక్ కోకన్వీనర్ జగన్నాథంనాయుడు, జిల్లా టూరిజం అధికారి ఎన్.నారాయణరావు, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, యోగా టీచర్లు టి.సుధారాణి, కె.రేణుక, శాసపు జోగినాయుడు పాల్గొన్నారు.

## నారాయణపురం ప్రాజెక్ట్ చైర్మన్‌గా ఢిల్లీశ్వరరావు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నాలుగు నియోజకవర్గాలు, 50వేల ఎకరాలకు సాగునీరు అందించే నారాయణపురం ఆనకట్ట శ్రీకాకుళం జిల్లా ప్రాజెక్టు చైర్మన్‌గా కోర్లకోట గ్రామానికి చెందిన సనపల ఢిల్లేశ్వరరావు నియమితులయ్యారు. తండ్రి సనపల లక్షున్నాయుడు కోర్లకోట గ్రామ సర్పంచ్‌గా, జిల్లా కోపరేటివ్ బ్యాంక్ డెరైక్టర్‌గా సేవలు అందించి ఎంతోమంది పేదలకు విత్తనాలు, ఎరువులు అందించి, కోర్లకోట గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా అభివృద్ధికి బాటలు వేశారు. నేడు ఆయన వారసత్వాన్ని పునికిపుచ్చుకొని వార్డు మెంబర్‌గా మొదలైన ఆయన ప్రస్థానం నీటి సంఘాల అధ్యక్షుడిగా, జిల్లా టీడీపీ కార్యదర్శిగా, వైకాపా ప్రభుత్వ హయాంలో నామినేషన్లు వేయడానికి భయపడిన రోజుల్లో కోర్లకోట గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీలను కైవసం చేసుకొని, మండలంలో క్లస్టర్ ఇన్‌ఛార్జిగా ఉండి సుమారు 10 ఎంపీటీసీలు టీడీపీ వసం అవ్వడంలో కీలక పాత్ర పోషించారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ విజయంలో తనదైన పాత్ర పోషించిన సనపల ఢిల్లేశ్వరరావు, జిల్లా ప్రాజెక్టు చైర్మన్‌గా నియమితులైనందుకు అభినందనలు తెలిపారు.

**NAME CHANGE**

I, **JAMI VENKATA DATTA KAMESAM** S/O RAMANA MURTY, residing at 7-9-10/2, CHEPALA STREET, CHINNA BAZAR, SRIKAKULAM, ANDRA PRADESH-532001 have changed my name to **HITIN VENKATA DATTA KAMESAM JAMI**

## జిల్లా సాగునీటి ప్రాజెక్టు సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం

- వంశధార ప్రాజెక్టు చైర్మన్‌గా అరవల
- నారాయణపురం ప్రాజెక్ట్ చైర్మన్‌గా సనపల
- చైర్మన్, వైస్‌చైర్మన్లను అభినందించిన ఎమ్మెల్యే శంకర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా ప్రశాంతంగా జరిగాయి. శనివారం స్థానిక ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో వంశధార ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజనీరు ఎన్నికలను పర్యవేక్షించారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు (డీసీలు) నీటి ప్రాజెక్టుల సంఘాలకు చైర్మన్, వైస్‌చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టుకు చైర్మన్‌గా నైరకు చెందిన అరవల రవీంద్రబాబు, వైస్‌చైర్మన్‌గా ఎల్లన్నపేట మండలానికి చెందిన ఆనందరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీపీఆర్ నారాయణపురం ఆనకట్ట ప్రాజెక్టు సిస్టంకు చైర్మన్‌గా సనపల ఢిల్లేశ్వరరావు, వైస్‌చైర్మన్‌గా పొన్నాడకు చెందిన పంచిరెడ్డి కృష్ణారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్‌లను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అభినందించారు. రైతులకు సకాలంలో నీరందించేందుకు కమిటీలు కృషి చేయాలని, కాలువలు ఆధునికరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, దానికి తమవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణమూర్తి, జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, బీజేపీ జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, పలువురు నీటిసంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, రైతులు, స్థానిక కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ధ్యాన దినోత్సవం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వం మహిళా డిగ్రీ కళాశాల (బాలికలు) శ్రీకాకుళంలో కళాశాల ప్రిన్సిపల్ కె.సూర్యచంద్రరావు అధ్యక్షతన ప్రపంచ ధ్యాన దినోత్సవం నిర్వహించారు. ముఖ్య వక్తగా సామాజిక సేవకులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, బాలల హక్కుల పరిరక్షణ వేదిక పూర్వపు జిల్లా కన్వీనర్ గురుగుబెల్లి దామోదరరావు, యోగా సైంటిస్ట్ మాస్టర్ డాక్టర్ బగాది పాపారావు పాల్గొన్నారు, అధ్యక్షులు సూర్యచంద్రరావు మాట్లాడుతూ మనసుకు శిక్షణ ఇవ్వడానికి, మానసిక స్పష్టత, భావోద్వేక ప్రశాంతత, శారీరక సడలింపు స్థితిని సాధించడానికి ధ్యానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యోగ సైంటిస్ట్ మాట్లాడుతూ మానసిక ప్రశాంతత, స్పష్టత, శారీరక సమతుల్యతను సాధించడానికి, ఒత్తిడిని తగ్గించడానికి, ఎమోషనల్ బ్యాలెన్స్‌ను మెరుగుపరచడానికి ధ్యానం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ప్రముఖ యోగా నిపుణులు డాక్టర్ పాపారావు బగాది విద్యార్థులతో ధ్యానం, కొన్ని యోగాసనాలు వేయించారు. అధ్యక్షులకు, యోగ సైంటిస్ట్‌కు దామోదర్‌రావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


అదానితో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని వామపక్ష నాయకులు, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో ఎంవీఎస్ శర్మ రాసిన 'నమో అదాని కరెంటు కహాని' అనే పుస్తకాన్ని వారు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ, కార్పొరేట్ దిగ్గజం గౌతమ్ అదానీల బంధం ఎంత గాఢంగా పెనవేసుకుపోయిందో చెప్పడానికి అమెరికాలో తాజాగా బయటపడ్డ అదానీ కేసు ఉదాహరణ అన్నారు. ఆస్ట్రేలియా నుంచి అదానీ కంపెనీ దిగుమతి చేసుకున్న బొగ్గును అధిక ధరలకు రాష్ట్రాలకు అంటగట్టడానికి మోడీ ప్రభుత్వం రాష్ట్రాలపై ఎలా ఒత్తిడి తెచ్చిందో వెల్లడైందని విమర్శించారు. కుంభకోణం బయటపడ్డాక కెన్యా ప్రభుత్వం మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం అదానీతో కుదుర్చుకున్న రూ.21వేల కోట్ల ఒప్పం



దాన్ని రద్దు చేసుకుందని, శ్రీలంక పోర్టు అభివృద్ధికి అదానీ కంపెనీకి నిధులు సమకూర్చే విషయంలో అమెరికా అభివృద్ధి ఏజెన్సీ పునరాలోచన చేస్తోందని, బంగ్లాదేశ్ ప్రభుత్వం అదానీతో కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందంపై న్యాయపరమైన సలహాలు తీసుకుంటోందని, కానీ ఇండియాలో మాత్రం మోడీ ప్రభుత్వం అదానీపై చర్యలు తీసుకోకపోగా, దాన్ని రక్షించడానికి పూనుకుందని ఆరోపించారు. పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ప్రజాశక్తి మేనేజర్ ఎస్.గణేష్, సీపీఎం పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, కోనారి మోహనరావు, గంగరాపు సింహాచలం, పి.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సచివాలయాల్లో సేవలు నిల్

అంతర్గత బదిలీలతో లాగిన్ ఇబ్బందులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న వార్డు సచివాలయాల్లో గత కొన్ని రోజులుగా నగర పౌరులకు సేవలు అందుబాటులో లేవని అర్జీదారులు విమర్శలు గుప్పిస్తున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో వార్డు సచివాలయాల్లో అంతర్గత బదిలీల కారణంగా అర్జీదారులు ఇబ్బంది పడుతున్నారు. వార్డు సచివాలయాల్లో వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సెక్రటరీలు బదిలీ చేయడంతో వీరి పరిధిలో ప్రజలకు అందించే సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. వీరితో పాటు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు పూర్తిస్థాయిలో వార్డు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు సమయపాలన పాటించడం లేదని తెలుస్తోంది. నగరపాలక కమిషనర్ మీటింగ్‌కు వెళ్తున్నట్టు చెప్పి విధులకు గైర్హాజరవుతున్నారని అర్జీదారులు చెబుతున్నారు. కొన్నిచోట్ల సచివాలయ సిబ్బంది ముఖహాజరు వేసుకొని సొంత పనుల్లో నిమగ్నమైపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు స్కాలర్‌షిప్ వెరిఫికేషన్ కోసం గత వారం రోజులుగా సచివాలయం చుట్టూ విద్యార్థులు తిరుగుతున్నా వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సెక్రటరీ అందుబాటులో ఉండడం లేదని చెబుతున్నారు. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం వార్డు సచివాలయం చుట్టూ తిరుగుతున్న దరఖాస్తు చేయడానికి సిబ్బంది అందుబాటులో ఉండడం లేదన్నారు. సచివాలయ సిబ్బందిని కొందరు వార్డు ప్రజలు ఫోన్‌లో సంప్రదించగా అంతర్గత బదిలీలు చేశారు తప్ప లాగిన్స్ మార్చలేదని సమాధానం చెబుతున్నారు. లాగిన్ మార్పు చేయకపోవడం వల్ల వెల్ఫేర్, ఎడ్యుకేషన్ కార్యదర్శి అందుబాటులో ఉన్నా పనులు జరగడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి వార్డు సచివాలయంలో లాగిన్ మార్పుచేసి సేవలు పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని అర్జీదారులు కోరుతున్నారు.

## హత్యకుట్ర కేసులో ఏడుగురు అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

ఏడుగురిని మీడియా ముందుకు తీసుకువచ్చి కేసు వివరాలను వెల్లడించారు. చిన్నబాడాంకు చెందిన నాగరాజును అంతమొందించాలని బీహార్‌కు చెందిన ముగ్గురు సభ్యుల గ్యాంగ్‌కు రూ.10 లక్షలు సుపారీ ఇచ్చినట్టు తెలిపారు. చిన్నబాడాం గ్రామంలో వ్యక్తిగత కక్షలు, ఆధిపత్యం, రాజకీయ విభేదాలు, భూవివాదాలు, ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో నాగరాజును అంపోలు శ్రీనివాసరావు, కూర్మాపు ధర్మారావుతో పాటు మరో ఇద్దరు సాక్ష్యాధారాలు దొరక్కుండా హత్య చేయాలని పథకం వేశారని తెలిపారు. దీనికోసం నవంబర్ 10న విశాఖలోని ఒక హోటల్‌లో బీహార్‌కు చెందిన ముగ్గురు సభ్యులను కలిసి రూ.10 లక్షలకు ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. ఒప్పందంలో భాగంగా రూ.2లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించారని వివరించారు. అడ్వాన్స్ తీసుకున్న బీహార్ గ్యాంగ్ సభ్యులు ముగ్గురు నవంబర్ 20, 30 తేదీల మధ్య చిన్నబాడాంలోని నాగరాజు ఇంటివద్ద రెక్కీ నిర్వహించారని వివరించారు. వీరి అనుమానాస్పద కదలికలను గుర్తించిన కాశీబుగ్గ పోలీసులు ఈ నెల 10న అదుపులోకి తీసుకొని విచారించగా కుట్రకోణం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. వారిచ్చిన సమాచారంతో మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. వీరి నుంచి రెండు పిస్టల్స్, ఒక తపంచా, 45 బుల్లెట్స్, మూడు బైక్‌లు, ఒక కారు, 9 మొబైల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నట్టు ప్రకటించారు. బీహారీ గ్యాంగ్ నుంచి స్వాధీనం చేసుకున్న మూడు బైకుల్లో ఒకటి పూణెలో దొంగలించి ఇక్కడకు తీసుకువచ్చినట్టు గుర్తించామన్నారు. మరో బైక్‌ను కంచిలి నుంచి రెంట్‌కు తీసుకొని వచ్చారని తెలిపారు. మూడో బైక్ ఎక్కడ నుంచి దొంగిలించారో తేలాల్సి ఉందన్నారు. హత్యకుట్ర కేసులో మరికొందరి పాత్రపై విచారణ జరుగుతుందని తెలిపారు. ఈ కేసును టెక్కలి, పలాస డీఎస్పీలు, పలాస సీఐ, కాశీబుగ్గ ఎస్ఐలు, మరికొంత మంది సిబ్బందితో కలిసి ఛేదించారని తెలిపారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడమే లక్ష్యం

- రూ.68 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- పార్టీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష



(సత్యంన్యూస్, టెక్కలి)

పల్లెపండగ పేరుతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలి పార్టీ కార్యాలయంలో రహదారులు, విద్యుత్తు, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ అధికారులతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. అన్ని గ్రామాల్లో సీసీ రహదారులు, డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరం ఉన్నచోట నిధులు సర్దుబాటు చేస్తామని, నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు ఆదేశించారు. ఇంకా పనులు ప్రారంభం కానీ గ్రామాల జాబితాను అందించాలని, సమస్యలున్న ప్రాంతమైతే తమ దృష్టికి తీసుకు రావాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ఐదు సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. నందిగాం మండలం వల్లభరావుపేట, టెక్కలి మండలం నరసింగపల్లి, సంతబొమ్మాళి మండలం పాత మాకవరం, టెక్కలి మండలం లింగాలవలస, జగత్‌పేట సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదన తయారుచేయాలని సూచించారు. విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. అవసరమున్నచోట నూతనంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు సరిగా లేవని స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, వాటి స్థానంలో తక్షణమే కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. నియోజకవర్గం పరిధిలో గ్రామీణ నీటి సరఫరా ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు త్వరితగతన పూర్తి చేయాలని ఆదేశించారు.

అనంతరం టెక్కలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ప్రజల నుంచి వినతులు స్వీకరించిన కింజరాపు అచ్చెన్నాయుడు వాటి పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వివిధ శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

## రీ-సర్వేలో లోపాలు.. వేలమంది విన్నపాలు

(మొదటిపేజీ తరువాయి)

వల్ల రికార్డుల్లో పేర్లు మారిపోవడంతో బ్యాంకుల నుంచి రుణాలు అందక, ఈ-క్రాప్ జరగక నేటికీ ఇబ్బందులు పడుతూ రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. లోపెంట రెవెన్యూ పరిధిలోని బాధిత రైతులు ఎన్నికల ముందు లావేరు తహసీల్దార్‌కు ఆధారాలతో సహా పలుమార్లు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు సర్వేయరు కొన్ని సుధీర్‌ను ఏడీ సర్వేశాఖకు తహసీల్దారు సరెండర్ చేశారు. అప్పటి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే అధికారి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా బాధిత రైతులు ఇచ్చిన వాంగ్మూలాన్ని వీడియో తీసి ఏడీ సర్వే శాఖ అధికారికి అందజేశారు. వీటిని సర్వే అధికారులు పరిగణలోకి తీసుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. సర్వేశాఖ ఏడీ అధికారులను సరెండరైన కొన్ని సుధీర్ మేనేజ్ చేసి శాఖపరమైన చర్యలు లేకుండా తప్పించుకున్నాడని బాధిత రైతులు చెబుతున్నారు. సరెండర్ చేసిన నెల రోజుల తర్వాత కాలు విరిగిందని మెడికల్ లీవ్ పెట్టి కొన్ని రోజులు మేనేజ్ చేశాడు. ఇంతలో ఎన్నికల ఫలితాలు రావడంతో కూటమి నాయకులను ఆశ్రయించిన సుధీర్ లావేరులో పోస్టింగ్‌కు ప్రయత్నించాడు. సుధీర్‌ను అందరూ తిరస్కరించడంతో స్థానిక ఎమ్మెల్యేను ఆశ్రయించి చివరికి మురపాక సచివాలయానికి బదిలీపై వచ్చాడు. ఆ తర్వాత కూడా చేతివాటం చూపిస్తూ ఇబ్బంది పెట్టడం ప్రారంభించాడని రైతులు చెబుతున్నారు. లోపెంట రెవెన్యూ పరిధిలో సుధీర్ చేతివాటం చూపించి భారీస్థాయిలోనే కూడబెట్టుకున్నట్టు ఆరోపణలున్నాయి. కూడబెట్టిన డబ్బులతో డీ-పట్టా భూములను, ఒక ఇంటిని కొనుగోలు చేసినట్టు విమర్శలు ఉన్నాయి. లోపెంటలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి రెవిన్యూ, సర్వే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు. రెవెన్యూ గ్రామంలో ఉద్దేశపూర్వకంగా మార్చిన రికార్డులను సరిచేసి రైతులందరికీ న్యాయం చేయాలని కోరుతున్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.